

యువత వ్యసనాలకు బానిస కారాదు 6
చంద్రచూడేశ్వర ఆలయంలో మహానవ చండీయాగం







వనం వీడి జనంలోకి..!

- ఐదేళ్లలో వన్యప్రాణుల దాడికి 254 మంది బలి
- 5వేల కుటుంబాల్లో నిత్యం భయం భయం
- రూ.165 కోట్ల పరిహారం పంపిణీ
- ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా..?
- అటవీశాఖపై భగ్గుమంటున్న జనం

బెంగళూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వన్యప్రాణులు, మానవ సంఘర్షణ తీవ్రమవుతోంది. అటవీప్రాంతాలలో దురాక్రమణల తోపాటు అభివృద్ధి పేరిట సాగుతున్న పనులతో వన్యప్రాణులు చెల్లాచెదురు అవుతున్నాయి. ఆహారంకోసం అటవీప్రాంత సమీపంలోని పల్లెలపై వన్యప్రాణులు దాడులు చేస్తున్నారుయి. ఇలా ఐదేళ్ల వ్యవధిలో రాష్ట్రవ్యాప్తంగా వన్యప్రాణుల దాడికి 254మంది బలయ్యారనేది భయాందోళన కలిగించే అంశం. వన్యప్రాణులు - మానవ సంఘర్షణ నియంత్రించేందుకు రూపొందిస్తున్న కార్యాచరణ మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. వన్యప్రాణుల ద్వారా ఐదేళ్లలో మనుషులు, పంటనష్టం, ఆస్తినష్టానికి సంబంధించి అటవీశాఖ 165 కోట్ల రూపాయలు పరిహారంగా అందించింది. 2023-24 లో వన్యప్రాణుల దాడులకు 65మంది బలికాగా 2024-25లో 42మంది మృతి చెందారు. వీరిలో 70శాతం పులి, చిరుత, ఏనుగు దాడులలో ప్రాణాలు కోల్పోయినవారే. మిగిలిన 30శాతం ఎలుగుబంటి, అడవిదున్నల దాడిలో ప్రాణాలు కోల్పోయారు.

మానవ తప్పిదాలెన్నో..

వన్యప్రాణుల దాడులకు మానవతప్పిదాలు ప్రధాన కారణాలుగా ఉన్నాయి. పలు చోట్ల అటవీప్రాంతాలు, అభయారణ్యాలలో భారీగా



బిళగిరి వద్ద ఏనుగు వీరంగం (ఫైల్)

ఆక్రమణలు జరిగాయి. అటవీ సరిహద్దు ప్రాంతంలోని ప్రజలు సంచరించేందుకు మార్గాలను కల్పించడంతో అకస్మికంగా వన్యప్రాణులకు దొరికిపోతున్నారు. వన్యప్రాణులకు తగినంత ఆహారం, సంతానోత్పత్తికి అటవీప్రాంతాలలో అనుకూలం లేకపోవడంతోనే అవి దాడులకు పాల్పడుతున్నాయి. అటవీ సమీప ప్రజలు వన్యప్రాణులు, అటవీప్రాంతాల్లో జీవనం సాగిస్తున్నందున ప్రమాదాలు కారణమవుతున్నాయి.

అడ్వాన్స్‌డ్ అలర్ట్ సిస్టమ్

అటవీప్రాంతాల సమీపంలోని గ్రామాల పరిధికి వన్యప్రాణులు వచ్చిన సమయంలో ప్రజలను హెచ్చరించడం లేదా సమాచారం అందించే అడ్వాన్స్‌డ్ అలర్ట్ సిస్టమ్‌ను మరింత బలోపేతం చేయదలిచారు. ప్రజలకు నేరుగా సమాచారం ఇచ్చే వ్యవస్థను రాష్ట్రంలోని అన్ని జిల్లాల పరిధిలో అమలు చేయదలిచారు. ఏఐ ఆధారిత సీసీ కెమెరాల ద్వారా వన్యప్రాణుల సంచారంపై నిఘా పెంచదలిచారు.

భయం భయంగా అటవీ ప్రాంత ప్రజలు

వన్యజీవులకు 5వేల కుటుంబాలు అనునిత్యం భయపడుతున్నారు. రాష్ట్రంలో 4067 మిలియన్ హెక్టార్ల సహజసిద్ధమైన అటవీప్రాంతం ఉంది. ఇందులో 11.34 లక్షల హెక్టార్లు అటవీసంరక్షణ ప్రదేశం. ఇక్కడ 5 పులుల అభయారణ్యాలు, 36 వన్యజీవి అభయారణ్యాలు, 19 సంరక్షణా రిజర్వు ప్రదేశాలు కూడా ఉన్నాయి. మొత్తంగా రాష్ట్రవ్యాప్తంగా 6,915 ఏనుగులు, 563 పులులు ఉన్నాయి. అత్యధికంగా కాళి పులుల అభయారణ్యంలో 2వేలు, నాగరహొళె జాతీయ ఉద్యానవనం పరిధిలో 1280, బిళగిరి రంగనబెట్ట పులుల అభయారణ్యం సమీపంలో 1662 కుటుంబాలు ఉన్నాయి. వన్యజీవులు పలు సందర్భాలలో దాడులకు అలవాటు పడ్డంతో వీరు నిరంతరంభయపడే పరిస్థితి కొనసాగుతోంది.

అధిక ఖర్చు ఏనుగులకే

ఒక ఏనుగును పట్టుకునేందుకు సుమారు 12 లక్షల రూపాయలు, ఒక పులిని బంధించేందుకు 5 లక్షల రూపాయలు ఖర్చు కానుంది. రాష్ట్రంలో 2021 నుంచి ఇప్పటివరకు 43 ఏనుగులను బంధించి 22 ఏనుగులను అభయారణ్యాలకు తరలించారు. వీటితోపాటు 14 పులులను బంధించారు. 2025లో 20 ఏనుగులు మృతి చెందాయి. వన్యప్రాణుల దాడులలో మనుషులు చనిపోతే రూ.15లక్షల పరిహారం ఇస్తున్నారు. మృతుల కుటుంబాల వారసులకు నెలకు రూ.4వేలు చొప్పున ఐదేళ్లపాటు పింఛన్ రూపంలో అందిస్తారు. అటవీప్రాంతాలలో ఆక్రమణలు తగ్గి అన్ని కాలాల్లోనూ వన్యప్రాణులకు తగిన ఆహారం, నీరు అటవీ ప్రాంతాల్లోనే లభిస్తే దాడులు తగ్గే అవకాశాలు ఉన్నాయి. వీటితోపాటు సాంకేతిక పరిజ్ఞానం ద్వారా మరిన్ని సౌలభ్యాలు కల్పించదలిచారు.

వన్య జీవులపై ప్రత్యేక పరిశోధనలు

మానవ, వన్యజీవి సంఘర్షణకు కారణమైన ఏనుగు, చిరుత, పులులను గుర్తించేందుకు అటవీ, పర్యావరణ, పశుసంవర్ధకశాఖ అధికారులను బృందాలుగా ఏర్పాటు చేశారు. వన్యప్రాణులు ఎందుకు అటవీ సరిహద్దులు దాటి వస్తున్నాయనే కోణంలో పరిశీలన జరుపుతున్నారు. ప్రధానంగా చిక్కమగళూరు, శివమొగ్గ, చామరాజనగర, హాసన్ తదితర జిల్లాల్లో ఏనుగులు పంట పొలాలపై దాడికి రావడమే ప్రమాదాలు ఎక్కువయ్యేందుకు కారణమని ప్రాథమికంగా గుర్తించారు. ఏనుగులకు తగినంత ఆహారం లభ్యం కావడం లేదా నీరు లభించక సరిహద్దులు దాటుతున్నాయా అనే కోణంలో పరిశీలిస్తున్నారు. ఏనుగులు అటవీ సరిహద్దులు దాటకుండా రైల్వేట్రాక్ కమ్మీలతో కంచెల ఏర్పాటు చేస్తున్నారు. మరిన్ని ప్రాంతాలలో భారీగా కాలువలను తవ్వుతున్నారు. ఏనుగులు కాలువలు దాటేందుకు వీలులేకుండా చేస్తున్నారు. ఇక చిరుత, పులుల వేట ద్వారా సరిహద్దు ప్రాంతాలలోకి వస్తే పశువులు, మనుష్యులపై దాడి చేస్తున్నాయి. కొన్ని చిరుతలు పశువులు లేదా మనుష్యులను చంపేందుకు అలవాటు పడితే అవి అడవిని వదిలే గ్రామాలవైపు వేటాడుతుంటాయని గుర్తించారు. ప్రధానంగా సాయంత్రం వేళ చిరుతల దాడి ఉంటుందని అటవీశాఖ గుర్తించింది. అందుకు అనుగుణంగానే అటవీ ప్రాంతాల సరిహద్దు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఏనుగుల దాడినుంచి నియంత్రించేందుకు ఏనుగుల గుంపులో ఆడ ఏనుగును గుర్తించి దానికి రేడియో కాలర్ అమరుస్తున్నారు. తద్వారా ఏనుగుల కదలికలను ఎస్ఎంఎస్, వాట్సాప్ ద్వారా సమీప గ్రామాల ప్రజలకు సమాచారం చేరుతుంది. దీంతో ప్రజలు అప్రమత్తమయ్యేందుకు వీలుంటుంది. ఇలా నాలుగైదు జిల్లాల పరిధిలో ఏనుగులనుంచి ప్రాణ, పంటలరక్షణకు వెసలుబాటు కల్పించారు. ఇటీవల పులులు, చిరుతల ప్రమాదాలు పెరిగిన మేరకు సూక్ష్మ ప్రదేశాలలో బోన్లను అమర్చి బంధిస్తున్నారు. వాటిని ఇతర ప్రదేశాలకు తరలిస్తున్నారు.



కుంకీలకు శిక్షణ ఇస్తున్న మావటీలు

ఉగ్రవాదం లాంటిదే

- పాఠశాల నీటి ట్యాంకులో విష ద్రావకం కలపడంపై సీఎం సిద్దరామయ్య ఆగ్రహం



బెంగళూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): శివమొగ్గ జిల్లా హొసనగర తాలూకా పాఠశాలలో తాగునీటి ట్యాంకులో క్రిమిసంహారకమందు కలపడం ఉగ్రవాదం లాంటి చర్య అని సీఎం సిద్దరామయ్య మండిపడ్డారు. ఈ సంఘటనను తీవ్రంగా పరిగణిస్తున్నామన్నారు. చిన్నారుల మారణహోమం జరపాలనే దురుద్దేశాన్ని ఎవరూ క్షమించరన్నారు. వంట సిబ్బంది గమనించడంతో పెనుప్రమాదం తప్పిందని, వారిని ప్రత్యేకంగా అభినందిస్తున్నానన్నారు. వెంటనే నిందితులు ఎవరో గుర్తించాలని పోలీసులను ఆదేశించినట్టు సీఎం ప్రకటించారు. ఈమేరకు శుక్రవారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

పాఠశాల ప్రాంగణంలోని ఒక ఓవర్‌హెడ్ ట్యాంకు, కింద రెండు ట్యాంకులు ఉన్నాయి. ట్యాంకు నీటిలో పాలపొడి మిశ్రమం చేసి పిల్లలకు పంపిణీ చేసేవారు. వంట తయారీకి మరో ట్యాంకులో నీటిని వినియోగించేవారు. గురువారం వంట తయారీకోసం ట్యాంకులో నీటిని ఉపయోగించుకునేందుకు సిద్ధం కాగా నీటి రంగులో తేడా వచ్చింది. వాసన గమనించగా ఘాటుగా ఉంది. ఏదో కలిపారనే అనుమానం వచ్చి వెంటనే హెడ్‌మాస్టర్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో గ్రామపంచాయతీ పాలకులు, ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. నీటిని పరిశీలించగా క్రిమిసంహారకమందు మిశ్రమమై ఉన్నట్లు గుర్తించారు. తహసీల్దార్ హెచ్‌జే రష్మి, తాలూకా పంచాయతీ ఈఓ నరేంద్రకుమార్‌లు పాఠశాలను సందర్శించారు. మరో ట్యాంకులో నీటి ద్వారా మిశ్రమం చేసిన పాలను తాగిన 18మంది పిల్లలను వెంటనే ఆసుపత్రికి తరలించారు. తహసీల్దార్, హెడ్మాస్టర్‌లు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

డాక్టర్ రాజ్‌కుమార్ సోదరి
నాగమ్మ కన్నుమూత



నాగమ్మ (ఫైల్)

బెంగళూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): కన్నడ కంఠీర దివంగత డాక్టర్ రాజ్ కుమార్ చెల్లెలు నాగమ్మ (94) తుదిశ్వాస వీడారు. వయోసహజ ఆరోగ్య సమస్యలతో ఆమె బాధపడుతుండేవారు. కర్ణాటక సరిహద్దున చామరాజనగర జిల్లా గాజనూరులో నాగమ్మ నివసిస్తుండేవారు. శుక్రవారం ఆమె కన్నుమూశారు. నాగమ్మకు ఐదుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. నాగమ్మ మృతి సమాచారం తెలియగానే శివరాజ్‌కుమార్‌తోపాటు రాఘవేంద్ర రాజ్‌కుమార్, అశ్విని పునీత్ తదితరులు గాజనూరుకు బయల్దేరారు. శివరాజ్‌కుమార్ ఉదయం గోవా వెళ్తుండగా విషయం తెలియడంతో హుటాహుటిన వెనుతిరిగి వచ్చారు. నాగమ్మకు పునీత్‌రాజ్‌కుమార్ అంటే ఎంతో అభిమానం ఉండేది. పునీత్‌రాజ్‌కుమార్ మృతి చెందిన విషయం కూడా నాగమ్మకు తెలపలేదని సమాచారం. నాలుగునెలలక్రితం యూట్యూబ్ చానెల్‌తో మాట్లాడిన ఆమె పునీత్ ఒకసారి వచ్చి నన్నుచూసివెళ్లు అంటూ వ్యాఖ్యానించారు. శనివారం అంత్యక్రియలు గాజనూరులో జరుపుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఇకపై ఏటా క్వాంటమ్ ఇండియా సదస్సు

- ముగింపు కార్యక్రమంలో మంత్రి బోసరాజు
- 1951 మంది ప్రతినిధుల భాగస్వామ్యం



సదస్సు ముగింపు కార్యక్రమంలో మంత్రులు బోసరాజు, సుధాకర్ తదితరులు

బెంగళూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): క్వాంటమ్ ఇండియా బెంగళూరు సమావేశం ఇకపై ఏటా నిర్వహించాలని భావిస్తున్నామని తొలి సదస్సు విజయవంతమైందని, ప్రపంచవ్యాప్తంగా 1951మంది ప్రతినిధులు భాగస్వామ్యులయ్యారని సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి బోసరాజు తెలిపారు. శుక్రవారం క్వాంటమ్ ఇండియా సదస్సు ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రెండురోజుల సదస్సులో ఎన్నో అంశాలపై చర్చ జరిగిందన్నారు. రౌండ్‌టేబుల్ సభలలో ఆస్ట్రేలియా, కెనడా, డెన్మార్క్, జర్మనీ, బంగ్లాదేశ్, ఇజ్రాయెల్, ఇటలీ, జపాన్, సింగపూర్, అమెరికా, యూకేతోపాటు పలు దేశాల ప్రతినిధులు పాల్గొన్నారన్నారు. క్వాంటమ్ పవర్‌హౌస్‌గా కర్ణాటకను అభివృద్ధి చేస్తామన్నారు. 500మంది ప్రతినిధులు భాగస్వాములు అవుతామని భావించామని అయితే అంతకు నాలుగింతల మంది పాల్గొనడం హర్షణీయమన్నారు. విజయవంతం చేసిన అందరికీ కృతజ్ఞతలన్నారు. 24 సెషన్‌లలో 75మంది స్పీకర్స్ పాల్గొన్నారన్నారు. 19దేశాల నుంచి ప్రతినిధులు విచ్చేశారన్నారు. ఐఐటీ ధారవాడ, రాయచూరు సంస్థలు క్యూపై ఏఐతో క్యూ విద్యా 8క్యూబిట్ క్వాంటమ్ కంప్యూటర్ స్థాపనకోసం ఒప్పందం చేసుకున్నారన్నారు.

ఇంత జాప్యమా.?

- సుప్రీం కోర్టు ఆదేశించినా అంతర్గత రిజర్వేషన్లు అమలు చేయరా?
- మండిపడిన మాదిగ సంఘాల సమాఖ్య



ఫ్రీడంపార్కులో మాదిగ సంఘాల సమాఖ్య నాయకుల అర్ధనగ్న ప్రదర్శన

బెంగళూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని కేంద్ర మాజీ మంత్రి నారాయణస్వామి హెచ్చరించారు. కర్ణాటక మాదిగ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం ఫ్రీడంపార్కులో నిరసన జరిపారు. ఈ సందర్భంగా నారాయణస్వామి మాట్లాడుతూ వర్గీకరణకు సంబంధించి సర్వే ముగిసిందని, నివేదికను తెప్పించుకుని వెంటనే రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు చూడాల్సి ఉంటుందని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల దాకా జాప్యం చేయాలని చూస్తే జిల్లా, తాలూకా కేంద్రాలలోనూ నిరసన కొనసాగుతుందన్నారు. ఇది బీజేపీ పోరాటం కాదని దశాబ్దాలుగా వర్గీకరణకోసం ఎదురుచూస్తున్న మాదిగల పోరాటం అన్నారు. ప్రభుత్వానికి కుర్చీ ముఖ్యమా... అభివృద్ధి ముఖ్యమా తేల్చుకోవాలన్నారు. 1976 నుంచి మాదిగలకు అన్యాయం జరుగుతోందన్నారు. జనాభా ఆధారంగా రిజర్వేషన్‌లు కల్పించాలన్నారు. ముఖ్యమంత్రి తరచూ సమాజవాదిగా చెప్పుకొంటారని, కానీ అన్ని కులాలకు న్యాయం ఎక్కడ జరిగిందని ప్రశ్నించారు. ఎమ్మెల్యే బసవరాజ్ మత్తిమడు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకటేశ్ దొడ్డేరి, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు హూడి మంజునాథ్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న ధర్మాధికారి డాక్టర్ ఎంఆర్ జయరాం దంపతులు

కైవారలో సామూహిక వరమహాలక్ష్మి పూజ

చింతామణి రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని కైవార క్షేత్రంలో యోగినారేయణ మఠం ట్రస్టు ఆధ్వర్యంలో శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని సామూహిక వరమహాలక్ష్మిపూజ నిర్వహించారు. ప్రాతఃకాల ఘంటానాదం, సుప్రభాతసేవ, గోపూజ జరిపారు. సామూహిక వ్రతంలో వేలాదిమంది మహిళలు పాల్గొన్నారు. వేదికపై లక్ష్మీదేవి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టించి అభిషేకం, పూజలు చేశారు. తాతయ్య ఉత్సవ మూర్తిని ఆలయం నుంచి సర్వాలంకృత పల్లకీలో మంగళవాయిద్యాలతో వేదికపైకి తీసుకొచ్చి కొలువుదీర్చారు. ధర్మాధికారి డాక్టర్ ఎంఆర్ జయరాం దంపతులు పూజలో పాల్గొన్నారు. శ్రీరామతారకమంత్రాన్ని సామూహికంగా పఠించారు.



పూజల్లో పాల్గొన్న మహిళలు



కూల్చేసిన గోడ



చెట్టు కొమ్మలు ఆటోలో తరలిస్తూ..

ప్రహరీ బలి పచ్చనిచెట్లు

- రాహుల్‌గాంధీ నిరసనకు ఫ్రీడం పార్కులో ఏర్పాట్లు
- చెట్ల నరికివేతపై ఆగ్రహం

బెంగళూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఓట్ల చౌర్యం ఆరోపణలతో లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ చేపట్టనున్న నిరసనకోసం నగరంలోని ఫ్రీడంపార్కులోని చెట్లను నరికివేశారు. దశాబ్దాలకాలంగా ఉన్న ప్రహరీనీ కూల్చివేశారు. ఓట్ల చౌర్యం జరిగిందని ఆరోపించిన రాహుల్‌గాంధీ బెంగళూరులో నిరసనకు సిద్ధమయ్యారు. ఈనెల 5న మంగళవారం ఫ్రీడంపార్కులో నిరసన చేపట్టనున్నారు. గురువారం రాత్రి సీఎం, డీసీఎంతోపాటు కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, సుర్జేవాలాలు పార్కును పరిశీలించారు. శుక్రవారం ఉదయం నుంచి భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. రాహుల్‌గాంధీ ఫ్రీడంపార్కులో ప్రవేశించేందుకోసమే ప్రత్యేక మార్గాన్ని ఏర్పా టు చేస్తున్నారు. ఇందుకోసం అడ్డుగా ఉన్న ప్రహరీని కొంతమేరకు కూల్చివేశారు. ఒక చెట్టు తొలగించారు. చెట్లను రక్షించాలని నిత్యం ప్రకటనలు చేసే బీబీఎంపీ, అటవీశాఖ అధికారులు విస్మరించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అయ్యాయి. కాగా ఫ్రీడంపార్కులో వేదిక ఏర్పాటు చేసేందుకు బ్యారికేడ్‌లను సిద్ధం చేస్తున్నారు.



బ్యారికేడ్లు సిద్ధం చేస్తున్న కూలీలు





తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1625.13	1,630.481
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	46.883	1,25,373
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	35,312	1,54,706
నీటి నిల్వ (టీఎంసీలు)	76.91	97.14

కారును ఢీకొన్న లారీ

- ఒకరికి తీవ్ర గాయాలు
- చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి



ప్రమాదంలో దెబ్బతిన్న కారు



గాయాలతో అశోక్

బళ్లారి రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తాలుకాలోని పరమదేవనహళ్లి పోలీస్‌స్టేషన్ సమీపంలో లారీ, కారు ఢీ కొని ఒకరు మృతి చెందారు. పీడీహళ్లి పోలీసులు తెలిపిన వివరాల మేరకు శనివారం గుంతకల్లు నుంచి బళ్లారి వెళ్తున్న కారును లారీ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామానికి చెందిన కంసల అశోక్ తీవ్రంగా గాయపడ్డారు. వాహనదారులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పీడీహళ్లి ఎస్‌ఐ తిమ్మారెడ్డి సిబ్బంది ప్రభాకర్‌రెడ్డి, రెహమాన్ ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంలో గాయపడిన అశోక్‌ను అంబులెన్స్‌లో బళ్లారి విమ్స్ ఆస్పత్రికి తరలించారు. విమ్స్‌లో చికిత్స పొందుతూ అశోక్ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు పీడీ హళ్లి పోలీసులు తెలిపారు.

కోతి దాడిలో ఇద్దరికి గాయాలు



గాయపడిన గోవిందు



శంకర్‌గౌడ

కంప్లి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): తాలూకా పరిధిలోని చిక్కజాగనూరు గ్రామంలో నల్ల ముచ్చుకోతి దాడిలో ఇద్దరు గాయాలపాలయ్యారు. శుక్రవారం గ్రామానికి చెందిన వనేనూరు గోవిందు, శంకర్‌గౌడ అనే ఇద్దరిపై కోతి దాడి చేసింది. వారు కంప్లి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందారు. అడవుల్లో పనిచేస్తున్న రైతుల వద్దకు వెళ్లి వారి వద్దకు వెళ్లి వారిపైన కూర్చొని కాసేపు ముచ్చట చేసి అనంతరం వారిపై దాడి చేసి గాయపరిచింది. అధికారులు స్పందించి కోతికి బోను ఏర్పాటు చేసి దాడుల నుంచి రక్షించాలని రైతులు కోరుతున్నారు.



రైతు మీద కూర్చున్న ముచ్చుకోతి

వర్గీకరణలో జాప్యంపై కుల సంఘాల నిరసన



బళ్లారిలో గుండు గీయించుకుని నిరసన తెలుపుతున్న నాయకులు



హోస్పేట్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బళ్లారి సిటీ, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అంతర్గత రిజర్వేషన్లను అమలు చేయడంలో జాప్యాన్ని ఖండిస్తూ మాదిగ సంస్థలు శుక్రవారం నగరంలో మాదిగ సంఘాల నాయకులు అర్ధనగ్న నిరసన ప్రదర్శన చేపట్టారు. నగరంలోని అంబేడ్కర్ సంఘం జిల్లా కార్యాలయం నుంచి వందలాది మందితో నిరసన చేపట్టిన అనంతరం నగరంలోని గడిగి చెన్నప్ప సర్కిల్ వద్ద ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కొంత మంది నాయకు లు గుండు చేయించుకుని నిరసన వ్యక్తం చేశారు. జిల్లాకలెక్టర్ కార్యాలయానికి ఊరేగింపుగా వెళ్లి సీఎంకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అంతర్గత రిజర్వేషన్ల కోసం 35 సంవత్సరాలుగా పోరాటం సాగిస్తున్నామన్నారు. సుప్రీంకోరుట షెడ్యూల్డ్ కుల జాబితాలోని 101 వర్గాలకు వారి జనాభా ప్రకారం అంతర్గత రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాలను స్పష్టంగా ఆదేశించిందన్నారు. అయితే తీర్పును అమలు చేయడంలో కర్ణాటక ప్రభుత్వం అనసవరంగా జాప్యం చేయడం వల్ల సమాజంలో తీవ్ర అసంతృప్తి నెలకొందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు తర్వాత హర్యానా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు అంతర్గత రిజర్వేషన్లను అమలు చేసి సామాజిక న్యాయం విషయంలో ఉన్నతస్థాయికి చేరాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షనమే రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. జిల్లాలోని వివిధ తాలూకాల నుంచి మాదిగ సంఘం నాయకులు పార్టీలకతీతంగా పాల్గొన్నారు.

హోస్పేటలో అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో

హోస్పేట(ఆంధ్రజ్యోతి): అంతర్గత రిజర్వేషన్ల అమలుపై సుప్రీం కోర్టు అభిప్రాయం ఉన్నప్పటికి సీఎం సిద్దరామయ్య సమయాన్ని వృధా చేస్తున్నారని దానిని అమలు చేయకుండా ,తన సీఎం పదవిని నిలుపుకోవడానికి ప్రయత్నిస్తున్నారని, అంతర్గత రిజర్వేషన్లను అమలు చేయకపోతే రాష్ట్ర వాప్తంగా తీవ్ర పోరాటం చేస్తామని అంబేడ్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు కేపీ ఉమాపతి హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కార్యాలయాల వద్ద శుక్రవారం వద్ద మాదిగ సంఘం పిలుపు మేరకు విజయనగరం జిల్లా మాదిగ, మాదిగ సంబంధిత కులాల అంతర్గత రిజర్వేషన్‌పోరాట కమిటీ నుంచి వేలాది మంది మాదిగ సంఘం సభ్యులు నిరసన చేపట్టారు. ప్రభుత్వానికి, సిద్దరామయ్యకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ అంతర్గత రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకుడు ఎంసీ వీరాస్వామి మాట్లాడుతూ ఆగస్టు 21, 2024న సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును ప్రభుత్వం అమలు చేయాలన్నారు. సమాజంలోని సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా, బలహీన వర్గాలకు ఆయా రాష్ట్రాలు అంతర్గత రిజర్వేషన్లు కల్పించాలనే ఆదేశం యొక్క పరిణామాలను రాష్ట్ర ప్రభుత్వం ఎదుర్కోవలసి వస్తుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కొట్టిగినల్‌కు చెందిన మల్లికార్జునమాట్లాడుతూ రాబోయే సమావేశాల్లో అంతర్గత రిజర్వేషన్లను ప్రవేశెట్టి హర్యానా, తెలంగాణలో అమలు చేసినట్లుగా అమలు చేయాలన్నారు.

కరవే ఆధ్వర్యంలో నోటు పుస్తకాల పంపిణీ

కంప్లి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి) : నారాయణగౌడ వర్గం కర్ణాటక రక్షణ వేదిక జిల్లా అధ్యక్షుడుఅంగడి శంకరప్ప పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం తాలుకాలోని ప్రభు క్యాంపులోని ప్రభుత్వ లోయర్ ప్రైమరీ స్కూలులో 50 మంది విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, స్టేషనరీలను కరవే నియోజకవర్గ అధ్యక్షులు బాలే మల్లికార్జున పంపిణీ చేశారు. ప్రభుత్వాస్పత్రిలో సీడీ రాజశేఖర్ ఆధ్వర్యంలో పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు.బేరర్లు హోన్నళ్లి గంగాధర, ప్రకాష్ కండేవాలా రంజిత్, డాక్టర్ మల్లేష్, మౌనేష్, మున్నా, శ్రీనివాస్, నాగరాజు, వీరేష్, రామకృష్ణ యాదవ్, గణేష్, తిప్పేస్వామి, రాఘవేంద్ర, హరీష్ పాల్గొన్నారు.



విద్యార్థులతో కరవే పదాధికారులు

సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు

- టీఏపీ ఈవో శ్రీకుమార్

కంప్లి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి) : ప్రజలకు ఉత్తమ సేవలందించినప్పుడే ఉద్యోగులకు గుర్తింపు లభిస్తుందని టీఏపీ ఈఓ శ్రీకుమార్ అన్నారు. తాలుకాలోని ఎమ్మిగనూరు గ్రామ పంచాయతీలో గ్రేడ్1 కార్యదర్శిగా పనిచేస్తున్న దొడ్డబసప్ప గురువారం పదవీ విరమణ కావడంతో శుక్రవారం ఆయన్ని పంచాయతీ, గ్రామ పంచాయతీ అధికారులు, ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీకుమార్ మాట్లాడుతూ ఎవరు ఏ హోదాలో ఉన్నా చివరికి రిటైర్మెంట్ తప్పదని, అయితే నిస్వార్థమైన సేవలతో నిత్యం గుర్తింపు లభిస్తుందన్నారు. ఉద్యోగంలో ఉన్నన్నాళ్లు నిస్వార్థంగా ప్రజలకు సేవలందించాలన్నారు. ప్రజా ఫిర్యాదులపై తక్షణమే స్పందిచాలన్నారు. ఈ కార్యక్రమంలో కేఎస్ మల్లనగౌడ్, పీడీఓ శేషగిరి తురునాయక్, గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు శారద, ఉపాధ్యక్షులు గాదిలింగప్ప, ఇమామ్‌సాబ్, అంజినమ్మ, పంచాయతీ సన్నాపురం గ్రామ పంచాయతీ అధ్యక్షుడు వై రమణయ్య సభ్యులు కే బసవరాజ్, కే భారతి తదితరులు పాల్గొన్నారు.

యువత వ్యసనాలకు బానిస కారాదు

మహంత్ శివయోగి జయంతి వేడుకల్లో ప్రొఫెసర్ ఆలం బాషా



మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఆలం బాషా

బళ్లారి సిటీ, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): యువజన సమాజం చెడు అలవాట్లకు కాకుండా, విద్యకు బానిసలుగా మారాలని సత్యం విద్యా కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆలంబాషా అన్నారు. శుక్రవారం మహంత్ శివయోగి జయంతి వేడుకల్లో భాగంగా జిల్లా యంత్రాంగం, జిల్లాపంచాయతీ , బెంగళూరు కర్ణాటక విద్య నియంత్రణ బోర్డు, సమాచారా ప్రజాసంబంధాల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని డాక్టర్ రాజ్‌కుమార్ రోడ్డులోని సాంస్కృతిక సముదాయం ప్రాంగణంలో నిర్వహించిన 'వ్యసన రహిత' దినోత్సవం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దృఢమైన శరీరం, ధృఢమైన మనసు ఉండాలంటే యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన సమాజ స్థాపనకు కృషి చేయాలన్నారు. మహంత్ శివయోగి వ్యసనాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించి వారి మనసులను మార్చి ప్రజల వ్యసనాలను ధానధర్మాల రూపంలో సేకరించి తద్వారా వ్యసన రహిత సమాజాన్ని నిర్మించడానికి కృషి చేసిన వ్యక్తి అన్నారు. 12వ శతాబ్దానికి చెందిన శరణాలు, బసవన్న కాలంలో సమాన సమాజాన్ని నిర్మించడానికి కృషి చేశారన్నారు. మన దేశం యువత అధికంగా ఉన్న దేశం, మనం ఎలాంటి దుర్గుణాలకు బలై పోకుండా వాటిని ఎదురించి నిలబడాలన్నారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఖుర్షీద్ బేగం మాట్లాడుతూ వ్యసనం అనేది మనస్సు, శరీరం కుటుంబం, దేశం యొక్క ఆరోగ్యాన్ని నాశనం చేసే సామాజిక దురాచారాల్లో ఒకటి అన్నారు. యువత వ్యసనాలకు లోను కాకుండా, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. మొబైల్ ఫోన్ల మోజులో విద్యకు దూరం కాకూడదన్నారు.

జిల్లామానసిక ఆరోగ్య కార్యక్రమ అధికారి శర్మాస్ వలీ మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు బానిసలైతే రాష్ట్ర ప్రభుత్వం నేషనల్ టెలిమెంటల్ హెల్త్ ప్రోగ్రామ్ కింద టెలిమెనెస్ 14416అనే ఉచిత హెల్త్ లైన్‌ను ప్రారంభించారని అవసరమైన వారు ఉపయోగించుకోవాలన్నారు. శివయోగి జయంతి వేడుకల్లో భాగంగా మద్యం, మాదకద్రవ్యాలు ,పొగాకు వ్యసనాల నుండి విముక్తి పొందుతామని ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్భంగా కన్నడ సాంస్కృతిక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగరాజు, సమాచారా శాఖ అసిస్టెంట్ గురురాజ్, వీసీ సిబ్బంది విజయ్‌కుమార్, మల్లేశప్ప, హనుమేశ్, హనుమంతప్ప, తేజ దివాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ ఉపసంచాలకుడు మంజునాథ్

సమగ్ర వ్యవసాయ విధానాన్ని అవలంబించాలి

- వ్యవసాయ ఉపసంచాలకుడు మంజునాథ్

బళ్లారి సిటీ, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): రైతులు సమగ్ర వ్యవసాయ విధానాన్ని అవలంబించి తమ ఆదాయాన్ని రెట్టింపు చేసుకోవాలని వ్యవసాయ ఉపసంచాలకులు మంజునాథ్ అన్నారు. బళ్లారి తాలూకాలోని సంజీవరాయనకోట గ్రామంలో శుక్రవారం వ్యవసాయశాఖ ఆత్మ పథకం కింద నిర్వహించిన రైతు శిక్షణా కార్యక్రమం, రైతు క్షేత్ర పాఠశాల, పత్తి పంటలలో గులాబీ కాయ తొలుచు పురుగు నిర్వహణపై శిక్షణా కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. గులాబీ కాయ పరుగు పత్తి పంటలకు చాలా నష్టం కలిగించే తెగులు అని దీనిని నియంత్రించడానికి రైతులు వేప కసాయం లేదా థియోడికార్బ పిచికారి చేయాలని ఆయన అన్నారు. రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా పంట మార్పిడి చేపట్టాలని, నానో యూరియా, నానోడిఎపీ వాడకం వల్ల వ్యవసాయ ఖర్చు తగ్గుతుందని ఆయన రైతులను ఒప్పించారు.

వ్యవసాయ సహాయ సంచాలకులు గర్జనప్ప మాట్లాడుతూ రైతులు తాము పండించే పంటలకు తప్పనిసరిగా పంట బీమా చేయించుకోవాలన్నారు. అధిక వర్షపాతం లేదా కరువు కారణంగా పంట దెబ్బతిన్నట్లయితే భీమా పథకం రైతులకు ఎంతో మేలు చేస్తుందన్నారు. పత్తిపంటల్లో రసం పీల్చే కీటకాలను నియంత్రించడానికి వేప ఆధారిత పురుగు మందులను పిచికారి చేయాలన్నారు. హగరి కృషి విజ్ఞాన కేంద్రంలో వ్యవసాయ శాస్త్రవేత్త మల్లేశ్ మాట్లాడుతూ రైతులు ఎకరానికి 2నుండి 3ప్యాకెట్ల పత్తి విత్తనాలను వాడటానికి బదులుగా ఒక ప్యాకెట్ పత్తి విత్తనాలను వాడాలన్నారు. మొక్కల మధ్య దూరం పాటించడం వల్ల దిగుబడి పెరుగుతుందన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఏడీసీ జుబేర్‌కు వినతి పత్రం ఇస్తున్న కమిటీ సభ్యులు

బళ్లారి సిటీ, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు ప్రత్యేకంగా ప్రతిభ చూపిన అతిథి ఉపాధ్యాయుల డిమాండ్లను నెరవేర్చాలని అఖిల భారత విద్య సేవ్ కమిటీ శుక్రవారం జిల్లాకలెక్టర్‌కు విజ్ఞప్తి చేసింది. ఈసందర్భంగా అఖిల భారత విద్యసేవ్ కమిటీ సోమశేఖర్ గౌడ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో వందలాది మంది ప్రత్యేకంగా ప్రతిభ చూపిన అతిథి ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. మంచి నాణ్యమైన విద్యను అందించడానికి, విద్యార్థుల భవిష్యత్తును నిర్మించడానికి నిజాయితీగా ప్రయత్నిస్తున్నామని, కానీ మాజీతాలు ఇప్పటికి దయనీయంగా ఉన్నాయన్నారు. తమ సేవలను పరిగణనలోకి తీసుకోకుండా ప్రతి సంవత్సరం తక్కువ గౌరవ వేతనంతో సహా ఎటువంటి సేవా భద్రత లేకుండా జీవిస్తున్నామన్నారు. పాఠశాలలు ఎంత దూరంలో ఉన్నా మేము శారీరక సమస్యలతో అక్కడికి వెళ్ళి బోధిస్తున్నామని, తమ అభ్యర్థులకు ప్రజా సాంకేతిక పరిజ్ఞానం పరంగా ప్రత్యేక హోదా ఇవ్వాలన్నారు. ఈసందర్భంగా నాగరత్న, సుధాకర్, అతిథి ఉపాధ్యాయులు పాల్గన్నారు.

బాల్యవివాహాలను అరికట్టాలి

- అవగాహనా కార్యక్రమంలో ఫీల్డ్ రిసోర్స్ పర్సన్ జకనాచారి



మొక్కకు నీరుపోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జకనాచారి

బళ్లారి సిటీ,ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): బళ్లారి జిల్లాలో బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ఇటీవల ప్రజలు క్రూరమైన జీవితాన్ని గడుపుతున్నారని ఫీల్డ్ రిసోర్స్ పర్సన్ జకనాచారి అన్నారు. శుక్రవారం సండూర్‌లోని క్షేత్ర విద్యా అధికారులు క్షేత్ర సమన్వయ అధికారుల కార్యాలయం ,ఆరోగ్య శాఖ, మహిళా శిశు అభివృద్ధి శాఖ, జిల్లా బాలల రక్షణ విభాగం , పిల్లల హెల్ప్‌లైన్ , గ్రామపంచాయితీ, వివిధ భాగస్వామ్య విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో తాలూకాలోని చోరనూర్ వ్యాప్తిలో బాల్య వివాహాల నినివారణపై అవగాహన కార్యక్రమాన్నిఆయన ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో బాల్య వివాహాల గరిష్ఠ కేసులు గుర్తించబడ్డాయని వాటిని నివారించడానికి మేము అవగాహన కల్పిస్తున్నామని, కానీ మూఢనమ్మకాలు పెరుగుతున్నాయని, బాలల హక్కులు, బాల్య వివాహ చట్టాల గురించి సమాచారం అందించాలన్నారు. విద్యఉంటేనే ఇటువంటి లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు,బాల కార్మికులను నిరోధించవచ్చన్నారు. స్థానిక నాయకుడు వెంకటేశ్ మాట్లాడుతూ పిల్లలు చిన్న వయస్సులోనే వివాహం చేసుకుంటే వారు అవయవ వైపల్య కారణంగా మరుగుజ్జులుగా కూడా పుడతారన్నారు. పిల్లలలో అవగాహన కల్పించాలన్నారు. ఈసందర్భంలో ఎస్‌డీఎంసీ అధ్యక్షులు కరిబసప్ప, పరమేశ్వరప్ప,విద్యా సమన్వయకర్త పాలక్షప్ప, నోడల్ అధికారులు మంజునాథ్ , ప్రిన్సిపాల్ బసవరాజ్, గ్రామపంచాయితీ అభివృద్ధి అధికారులు కరిబసవరాజ్, చైల్డ్‌ప్లానింగ్ అధికారులు శారద షిండే, సీఆర్‌పీ రమేశ్, జానపద కళాకారుడు లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ ప్రారంభం



హాల్‌ను ప్రారంభిస్తున్న మానవ వనరుల అధికారి గణేష్ హెగ్డే

హోస్పేట,ఆగస్టు1:(ఆంధ్రజ్యోతి):కమ్యూనిటీ హాళ్లు సమాజంలోని సంక్లిష్టతను తొలగించడానికి ప్రతి ఒక్కరూ సామరస్య పూర్వకంగా, శాంతియుతంగా కలిసి రావడానికి, చర్చించడానికి, అభిప్రాయాలను మార్పిడి చేసుకోవడానికి సహాయపడతాయని బీఎంఎం పరిపాలన, మానవ వనరుల విభాగం అధిపతి గణేష్ హెగ్డే అన్నారు. మరియమ్మన గ్రామంలోని దాననాయకన కెరె గ్రామంలో బీఎంఎం కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమం కింద నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో జరిగే శుభ కార్యాలకు సమష్టిగా గుమిగూడడానికి ప్రతి గ్రామంలో సరైన స్థలం లేకపోవడం విడ్డూరమన్నారు.

పత్తి సాగులో అధికారుల సలహాలు పాటించాలి : డీడీ

సిరుగుప్ప, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి) : పత్తి సాగులో రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని జిల్లా వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మంజునాథ సూచించారు. శుక్రవారం సిరుగుప్ప తాలుకాలోని అచ్చొళ్లి గ్రామంలో పత్తిపంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తిపంటకు ఏమైనా రోగం సోకితే తక్షణమే వ్యవసాయ పరిశోధన అధికారులను కలవాలని, వారి సూచనలు పాటించాలన్నారు. సిరుగుప్ప తాలుకా వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

సబ్ కలెక్టర్ కార్యాలయంలో రైతుల సమావేశం



సమావేశానికి వస్తున్న రైతు సంఘాల నాయకులు, రైతులు

హోసూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): నగరంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో రైతుల సమావేశం శుక్రవారం జరిగింది. సబ్‌కలెక్టర్ ఇన్‌చార్జ్ గీతారాణి అధ్యక్షత వహించారు. శూలగిరి తాలూకా, డెంకణీకోట, అంచెట్టి, తళి తదితర తాలూకాలనుంచి రైతులు వచ్చారు. తాలూకాలలోని చెరువులలో పూడిక తీయాలని, ప్రభుత్వ భూములలో ఇళ్లు నిర్మించి రెండు దశాబ్దాలుగా నివసిస్తున్న వారికి పట్టాలు జారీ చేయాలని, రైతులకు విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గిరిజన గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని, విద్యార్థుల దృష్ట్యా ప్రాథమిక బస్సు సదుపాయం కల్పించాలని కోరారు. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, రైతులకు బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పించాలన్నారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రైతుల అర్జీలను పరిష్కరించాలన్నారు. తమడిమాండ్ల గురించి వినతులను సబ్‌కలెక్టర్‌కు అందచేశారు. సమావేశంలో వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

గుండెపోటుతో విలేజ్ అకౌంటెంట్ మృతి



వీరయ్య (ఫైల్)

సిరుగుప్ప, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): నాడంగ గ్రామ విలేజ్ అకౌంటెంట్ వీరయ్య(58) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. తహసీల్దార్ గౌసియాబేగమ్, విలేజ్ అకౌంటెంట్ సంఘం అధ్యక్షుడు మంజునాథ, మాజీ అధ్యక్షులు విరుపాక్షి, జిల్లా అధ్యక్షులు రామప్ప ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులను స్వయంగా పరామర్శించారు.

కండిషన్ లేని బస్సులపై చర్యలు తీసుకోవాలి : ఎస్‌ఎఫ్‌ఐ

మడకశిర టౌన్, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐనాయకులు కోరారు. పరిమితికి మించి విద్యార్థులను ప్రైవేట్ స్కూల్ బస్సులో ఎక్కిస్తున్నారని, కండిషన్‌లేని ప్రైవేట్ స్కూల్ బస్సులపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు ఈరేష్ అన్నారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో సీఐ నాగేష్‌బాబును కలసి విద్యార్థులు, సంఘం నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ పరిమితికి మించి ప్రైవేట్ పాఠశాలల స్కూల్ బస్సులో ఎక్కిస్తున్నారని దీంతో ప్రమాదాలకు ఆస్కారం ఉందన్నారు. ప్రమాదాల జరగకుండా ముందుగా చర్యలు తీసుకోవాలని కోరారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్

రోడ్డు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

హోసూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): హోసూరు ఫ్లై ఓవర్‌లో పగుళ్ల కారణంగా ట్రాఫిక్‌ను మళ్లించారు. దీంతో ఇతర రోడ్లపై కార్లు, ద్విచక్రవాహనాలతోపాటు భారీ వాహనాలు వెళ్తున్నాయి. దీంతో దెబ్బతిన్న రోడ్లను బాగు చేసే ప్రక్రియ చేపట్టారు. పాత మునిసిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న బాగలూరు రోడ్డు నుంచి తాలూకా ఆఫీస్ రోడ్డుకు వచ్చే ద్విచక్రవాహనాలను ఫ్లై ఓవర్‌కింద నుంచి కృష్ణగిరి సర్వీస్‌రోడ్డు, రాయకోట్టై రోడ్డు మార్గం మీదుగా నగరంలోకి మళ్లించారు. దీంతో ట్రాఫిక్ రద్దీ పెరిగింది. వాహనాలను నియంత్రించడానికి పోలీసులు ఎంతో శ్రమించాల్సి ఉంటోంది. ప్రతిరోజూ ఒక్కో మార్గంలో ట్రాఫిక్‌ను మళ్లిస్తుండడంతో ప్రజలు కూడా ఇబ్బంది పడుతున్నారు. ఏఏ రూట్‌లో వెళ్లాలో అవగాహన కల్పిస్తున్నారు. దెబ్బతిన్న రోడ్లను రూ.10కోట్లతో బాగు చేసేలా పనులు చేపట్టారు. ఎమ్మెల్యే ప్రకాశ్ శుక్రవారం స్వయంగా పరిశీలించి నాణ్యత పాటించాలని కంట్రాక్టర్‌కు సూచించారు. ఈ సందర్భంగా హోసూరు డిప్యూటి మేయర్ ఆనందయ్య కూడా ఉన్నారు.

చంద్రచూడేశ్వర ఆలయంలో మహానవ చండీయాగం

హోసూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): చంద్రచూడేశ్వర ఆలయంలో మహానవ చండీ యాగం జరుగుతోంది. శుక్రవారం గణపతి హోమం నిర్వహించారు. కొండపై ఉన్న పచ్చదేవతకు నీటికుండలు, పాలకుండలతో అభిషేకం నిర్వహించారు. కళశ పూజ కూడా భక్తిశ్రద్ధలతో జరిగింది. శని, ఆదివారాలలో కూడా పూజా కార్యక్రమాలు కొనసాగనున్నాయి. మూడు రోజులూ అన్నదానం జరుగుతుంది.



ఆలయంలో విశేష పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంఖ్...

పింగళి వెంకయ్య (జయంతి)



జాతీయపతాక రూపకర్త పింగళి వెంకయ్య 1876 ఆగస్టు 2న కృష్ణా జిల్లా మచిలీపట్నం ప్రాం తం భట్లపెనుమర్రులో జన్మిం చారు. స్వాతంత్ర్య సమర యో ధుడు వ్యవసాయంతోపాటు విద్యావేత గా, భూగర్భ శాస్త్రవేత్తగా రాణించారు. 19వ యేట సైన్యంలో చేరి దక్షిణాఫ్రికాలోని రెండో బోయర్ యుద్ధంలో పాల్గొన్నారు. 1916లో 'భారతదేశానికొక జాతీయ జెండా' అనే పుస్తకాన్ని ఆంగ్లంలో రాసి ప్ర చురించారు. మచిలీపట్నంలో విద్యాసంస్థను ఏర్పాటు చేశారు. సంస్కృతం, ఉర్దూ, జపాన్ భాషల్లో మంచి పాండిత్యం పొందారు. జపాన్‌భాషలో అనర్గళంగా మాట్లాడే ఆయనను 'జపాన్ వెంకయ్య' అని పిలిచే వారు. నిరాడంబర, నిస్వార్థమైన జీవితం గడిపిన గొ ప్ప వ్యక్తి. 1963 జూలై 4న కన్నుమూశారు. కాగా 2009లో ఆయన జ్ఞాపకార్థం పోస్టల్‌స్టాంపు విడుదల చేశారు.

ఆచార్య ప్రఫుల్ల చంద్ర రాయ్ (జయంతి)



ఆచార్య 'సర్' ప్రఫుల్ల చంద్ర రాయ్ 1861 ఆగస్టు 2న ప్రస్తుత బంగ్లాదేశ్‌లోని ఖుల్నా ప్రాంతంలో జన్మించారు. బెంగాలీ విద్యావేత్తగా, రసాయన శాస్త్రజ్ఞుడిగా, పారిశ్రామిక వేత్తగా రాణించారు. మానవతావాదిగా గుర్తింపు పొందారు. రసాయనశాస్త్రంలో గొప్ప ప్రొఫెసర్. దేశంలో తొలి ఫార్మాకంపెనీ అయిన బెంగాల్ కెమికల్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ సంస్థాపకులు. 'రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ'చే గౌరవం అందుకున్నారు. ఎన్నో గౌరవ డాక్టరేట్‌లు పొందారు. ఆంగ్లంలో ఆటోబయోగ్రఫీ రాశారు. బెంగాల్ సాహిత్య సమ్మేళనానికి రెండుసార్లు ఎంపికయ్యారు. 1944 జూన్ 16న కన్నుమూశారు.

బళ్లారి రాఘవ (జయంతి)




తెలుగు నాటకరంగ ప్రముఖులు బళ్ళారి రాఘవ 1880 ఆగస్టు 2న అనంతపురం జిల్లా తాడిపత్రిలో జన్మించారు. పూర్తి పేరు తాడిపత్రి రాఘవాచార్యులు. వృత్తి రీత్యా న్యాయవాది. బ్రిటీష్ ప్రభుత్వం ఆయన ప్రతిభను గుర్తించి పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించింది. 'రావు బహద్దూర్' అని బిరుదు కూడా ఇచ్చింది. అదే రీతిన తెలుగు, కన్నడ, ఇంగ్లీషు, హిందీ భాషలలో నాటకాలు ప్రదర్శించారు. గాంధీ, ఠాగూర్, జార్జ్‌బెర్నార్డ్‌షా వంటి వారు ఆయన నాటకాలను ప్రశంసించారు. స్త్రీలను నాటకాలలో పాల్గొనడానికి రాఘవ ప్రోత్సహించేవారు. శ్రీలంక, ఇంగ్లండ్, ఫ్రాన్స్, జర్మనీ, స్విట్జర్లాండ్ తదితర దేశాల సదస్సులలో నాటకాలు, కళలపై ప్రసంగించారు. తన సమయాన్ని, సంపదను నాటకరంగం కోసమే వెచ్చించారు. 1946 ఏప్రిల్ 16న కన్నుమూశారు.

మల్లాది సుబ్బమ్మ (జయంతి)



స్త్రీవాద రచయిత్రి మల్లాది సుబ్బమ్మ 1924 ఆగస్టు 2న గుంటూరు జిల్లా రేపల్లె తాలూకా పోతార్లంకలో జన్మించారు. 'స్త్రీ స్వేచ్ఛ' పత్రిక సంపాదకురాలిగా వ్యవహరించారు. అదే విధంగా 'వికాసం' అనే పత్రికను కూడా నిర్వహించారు. స్త్రీ జనోద్ధరణ, కుటుంబ నియంత్ర, స్త్రీ విద్యకోసం కృషి చేశారు. మద్యపాన నిషేధ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించారు. 110 పుస్తకాలు, 500కుపైగా వ్యాసా లు రచించారు. ఫిలిం సొసైటీకి ఛైర్‌పర్సన్‌గా వ్యవ హరించారు. తన యావదాస్తిని మల్లాది సుబ్బమ్మ ట్రస్టుకు సమర్పించారు. 2014 మే 15న కన్నుమూశారు.

కల్నల్ హెన్రీ స్టీల్ అల్కాట్ (జయంతి)



కల్నల్ హెన్రీ స్టీల్ అల్కాట్ 1832 ఆగస్టు 2న యూఎస్‌లోని న్యూజెర్సీలో జన్మించారు. అమెరికాకు చెందిన మిలిటరీ అధికారి, పాత్రికేయుడు, న్యాయవాది. థియోసాఫికల్ సొసైటీ సహ సంస్థాపకులు, తొలి అధ్యక్షుడు. శ్రీలంకలో బుద్ధిజం విస్తరణకు ఎంతో కృషి చేశారు. తుదిశ్వాస వరకు థియోసాఫికల్ సొసైటీకి అధ్యక్షుడిగా కొనసాగడం విశేషం. 1907 ఫిబ్రవరి 17న మద్రాస్‌లో కన్నుమూశారు.

దేవిశ్రీ ప్రసాద్ (పుట్టినరోజు)



డీఎస్‌పీగా పేరొందిన ప్రముఖ సంగీతదర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ 1979 ఆగస్టు 2న తూర్పు గోదావరి జిల్లా వెదురుపాకలో జన్మించారు. స్వరకర్తగా, గాయకుడిగా రాణించారు. తెలుగు, తమిళ భాషల్లో 25ఏళ్లలో వందకు పైగా సినిమాలకు సంగీతాన్ని అందించారు. నంది అవార్డుతోపాటు ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలు అందుకున్నారు. 10 ఫిల్మ్‌ఫేర్, 5 సినీ 'మా' అవార్డులు, 7 సైమా అవార్డులు, ఒక నంది అవార్డు ఇతర గౌరవాలు అందుకున్నారు. కాగా స్టేజ్ ప్రదర్శనలతో రాక్‌స్టార్‌గా సభికులను అలరిస్తున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



చేతికి అందే ఎత్తులో విద్యుత్ తీగలు

రొద్దం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పెన్నానదిలో విద్యుత్ తీగలు చేతికందే ఎత్తులో వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. రొద్దంలోని రొద్దకాంబ దేవాలయం వెనుకభాగంలోని పెన్నానదిలో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయి. పెన్నానదిలో చిన్నపాటి బోర్లు వేసుకుని పంటలు సాగుచేసుకునేందుకు రైతులు సిద్ధం చేసుకోగా విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. ఈ విషయమై ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని రైతులు అంటున్నారు. వెంటనే ట్రాన్స్‌కో అధికారరులు సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

అరసన చెరువులో తగ్గిన నీటిమట్టం



చెరువులో నీటిమట్టం ఇలా...



చెరువుకట్టపై గంగాభవాని అమ్మవారి ఆలయం

» రోజురోజుకు తగ్గుతున్న తాగునీరు

చింతామణి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలకు తాగునీటిని అందించే ప్రముఖ చెరువు కన్నంపల్లితోపాటు పట్టణానికి సుమారు 13 కిలోమీటర్ల దూరంలోని అంబాజిదుర్గ హోబళి భక్తరహళ్ళిలోని అరసనచెరువులో నీటిమట్టం తగ్గుతోంది. అరసన చెరువును తాగునీటి ఉద్దేశ్యాలకోసం నగరసభ ప్రణాళిక రూపొందించింది. ఈసారి వర్షం ఆశించిన మేరకు కురవకపోవడంతో చెరువులో రోజురోజుకు నీటిమట్టం తగ్గుతోంది. దీంతో చింతామణి పట్టణంలోని కొన్ని లే అవుట్‌లలో నీటి ఎద్దడి సమస్య తలెత్తే అవకాశం కనిపిస్తోంది. ఎన్నో దశాబ్దాలుగా పట్టణానికి తాగునీటిని అందించేది ప్రధానంగా కన్నంపల్లి చెరువు, దీనికి తోడు అరసన చెరువు నుంచి కూడా మూడేళ్లుగా తాగునీటి అవసరాలకు వినియోగిస్తున్నారు. గత ఏడాది, ప్రస్తుత సంవత్సరం కూడా వర్షాభావం కారణంగా చెరువులో నీటి ప్రమాణం తక్కువగా ఉంది.

ప్రస్తుత నీటి పరిస్థితిపై అభిప్రాయాలు ఇలా ఉన్నాయి. చెరువులో నీటిని పంపింగ్ చేసే కార్మికుడు మునిరెడ్డి అభిప్రాయం ప్రకారం జోరు వర్షం కురిస్తేనే నాలుగైదు కాలువల ద్వారా చెరువుకు ఒకమోస్తరు నీరు చేరుతుంది. చెరువుకట్టపై ఉన్న గంగాభవాని అమ్మవారి దయవలన చెరువు ఎప్పుడూ పూర్తిగా ఎండిపోయే పరిస్థితి రాలేదన్నారు. చెరువుకు తూర్పున రాతిగుండ్ల వద్దకు నీరు చేరేసరికి మళ్లీ వర్షం కురుస్తుందని భక్తుల విశ్వాసంగా ఉందన్నారు.

నగరసభ కమిషనర్ జీఎస్ చలపతి అభిప్రాయం ప్రకారం చింతామణికి మూడేళ్లుగా అరసన చెరువు నుంచి నీరు అవుతోందని, వర్షం కొరతతో చెరువులో నీటిమట్టం తగ్గుతోందన్నారు. రానున్న రోజుల్లో వర్షం కురిస్తే చెరువులకు నీరు చేరి సమస్య తీరుతుందనే విశ్వాసం వ్యక్తం చేశారు. నీటి ఎద్దడి ప్రదేశాలను గుర్తించి అత్యవసరమైన చోట్ల మాత్రం బోరుబావులు తవ్వి పరిష్కరిస్తామన్నారు. చెరువునుంచి తాగునీటి సరఫరాను సమర్థవంతం చేసేందుకు మంత్రి సుధాకర్ సమర్పించిన రూ.35కోట్లతో యాక్షన్‌ప్లాన్‌కు మంత్రివర్గంలో ఆమోదం దక్కడంతో త్వరలోనే పనులు జరుగుతాయన్నారు.

నగరసభ అధ్యక్షుడు ఆర్ జగన్నాథ్ అభిప్రాయం ప్రకారం అరసనచెరువులో సంపూర్ణంగా పూడిక తీత చేపట్టి, ప్రస్తుత చెరువు కట్ట విస్తీర్ణాన్ని పెంచి డ్యాం తరహాలో నిర్మించేందుకు కార్యాచరణ రూపొందించబడిందన్నారు. రానున్న రోజుల్లో నెక్కుంది చెరువును తాగునీటి అవసరాలకు వినియోగించేందుకు నియోజకవర్గ ఎమ్మెల్యే, విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ అధికారులతో చర్చలు జరిపారన్నారు. నిధుల విడుదలకోసం కసరత్తు సాగుతోందని, చెరువుల అభివృద్ధి సాకారమైతే చింతామణి పట్టణానికి తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కారం కానుందన్నారు.

విద్యకు అధిక ప్రాధాన్యం

» ట్రస్టు అధ్యక్షుడు మేడా రామకృష్ణ



ట్రాక్‌సూట్‌లతో విద్యార్థులు, ఆలయ ట్రస్టు పదాధికారులు

బొమ్మనహళ్ళి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పేద పిల్లల విద్యాభ్యాసం కోసం అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు అరికెరె శాంతినికేతన్ లే అవుట్‌లోని సాయిబాబా ఆలయ ట్రస్టు అధ్యక్షుడు మేడా రామకృష్ణ తెలిపారు. బాబా ఆలయ మందిరంలో యలహంక నీలకంఠేశ్వర ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు 72మందికి ట్రాక్‌సూట్‌లను పంపిణీ చేశారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ పేద విద్యార్థులకోసం సాయిసంతోషిమాతా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పదేళ్లుగా మెరిట్ విద్యార్థులకు ప్రోత్సాహకాలు, బహుమతులు అందచేస్తూ ప్రోత్సహిస్తున్నామన్నారు. యలహంక పాఠశాల విద్యార్థులకు గత ఏడాది కూడా ఇచ్చామన్నారు. స్కూల్‌లో తెలుగు, కన్నడ తమిళ విద్యార్థులు ఉన్నారని, ఇక్కడ పేద, మధ్యతరగతి వర్గాల వారే అధికమని గుర్తించి తమవంతుగా చేయూత ఇస్తున్నామన్నారు. ఇప్పటికే 405మందికి మెరిట్ స్కాలర్‌షిప్‌లు ఇచ్చామన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్కూల్‌బ్యాగులు, నోటు పుస్తకాలు కూడా ఇస్తున్నామన్నారు. బెంగళూరు మాత్రమే కాకుండా ఇతర గ్రామీణ ప్రాంతాల వారికి కూడా కిట్‌లు ఇచ్చామన్నారు. ఈ సంవత్సరం కూడా అదే రీతిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఇస్తామన్నారు. ట్రస్టు ద్వారా ధార్మిక కార్యక్రమాలే కాకుండా సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఇందుకు భక్తులు, దాతల సహకారం ఎంతో ఉందన్నారు. ఆలయ మందిరంలో ఫ్రీ మెడిసన్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందుకు ఎంబీబీఎస్ డాక్టర్లు కూడా తమవంతు ఉదారంగా సహకారం అందిస్తున్నారన్నారు. కాగా నీలకంఠేశ్వర పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రెడ్డిరాణి మాట్లాడుతూ తమ పాఠశాలకు చేయూత ఇస్తున్న సాయిబాబా ఆలయ ట్రస్టు అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు కార్యదర్శి తాతయ్యగుప్త, కృష్ణయ్యశెట్టి, టీవీజీ గుప్త, సత్యనారాయణశెట్టి, సురేశ్‌శర్మ, నీలకంఠేశ్వర పాఠశాల ఎస్‌డీఎంసీ అధ్యక్షుడు సుబ్రమణ్యం, కార్యదర్శి వెంకటనారాయణ, ఉపాధ్యాయుడు శ్రీరంగయ్య తదితరులు పాల్గొన్నారు.

శిశువుల వైద్యంలో జాగ్రత్తలు ముఖ్యం



ఐసీయూ ప్రారంభంలో మాజీ మంత్రి ఎంటీబీ నాగరాజ్ తదితరులు

బెంగళూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): శిశువుల వైద్యంలో జాగ్రత్తలు ముఖ్యమని చిన్న పిల్లల ఆసుపత్రిలో ఐసీయూ విభాగాల ఏర్పాటు కీలకమని మణిపాల్ ఆసుపత్రి పిడియాట్రిషన్ భాస్కర్ షెణై అభిప్రాయపడ్డారు. కిండర్ ఆసుపత్రిలో శుక్రవారం పీఐసీయూ విభాగాన్ని ప్రారంభించారు. మాజీ మంత్రి ఎంటీబీ నాగరాజ్‌తోపాటు కిండర్ ఆసుపత్రి ఛైర్మన్ ప్రదీప్‌కుమార్‌లు పాల్గొన్నారు. భాస్కర్ షెణై మాట్లాడుతూ పీఐసీయూలో అంతర్జాతీయస్థాయి ప్రమాణాలకు అనుగుణంగా ఏర్పాటు చేశారన్నారు. ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే చిన్నారులకు సకాలంలో సమగ్రమైన వైద్యం అందించాలనేది లక్ష్యం పెట్టుకున్నామన్నారు. పిడియాట్రిక్ సూపర్‌స్పెషాలిటీ విభాగం నిరంతరంగా పనిచేస్తుందన్నారు. డాక్టర్ సంపత్‌కుమార్‌శెట్టిగార్, హర్షవర్ధన్, వికాస్ కృష్ణానంద, ఆంటోని రాబర్ట్ చార్లెస్, పార్థ ప్రతిమాపాల్, శిల్పాపాండ్యలు పాల్గొన్నారు.

మొబైల్ వ్యసనం వీడుతామని ప్రతిజ్ఞ



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

శిడ్లఘట్ట, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఇటీవలికాలంలో విద్యార్థులు స్మార్ట్‌ఫోన్‌కు వ్యసనంగా మారుతున్నారని దీనినుంచి బయటపడాలని దేవరమళ్ళూరు చన్నకృష్ణ అభిప్రాయపడ్డారు. సాంకేతిక ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవడంలో తప్పులేదని అయితే గంటల తరబడి మొబైల్‌లో మునిగిపోరాదన్నారు. దేవరమళ్ళూరు గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. చన్నకృష్ణ మాట్లాడుతూ ఇటీవలికాలంలో విద్యా ప్రమాణాలు తగ్గుతున్నాయని, ప్రతి ఇంట్లోనూ మొబైల్ విపరీత వాడకం ద్వారా అనారోగ్య సమస్యలు, ఇతర దుష్ప్రభావాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఈ అంశంపై తల్లిదండ్రులు కూడా దృష్టి సారించాలన్నారు. తొలుత పాఠాలపై దృష్టి సారించాలని, ఆసక్తిగల క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ చాటుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణప్ప, స్కూల్ అసిస్టెంట్ శశి, గెస్ట్ టీచర్ శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంత విద్యార్థులకు ఆకాశ్ ప్రోత్సాహకాలు



మీడియాతో దీపక్ మెహ్రోత్రా తదితరులు

బెంగళూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ప్రతిభావంత విద్యార్థులను రూపొందించడంతో పాటు తగిన ప్రోత్సాహకాలను అందించడం లక్ష్యంగా పెట్టుకున్నామని ఆకాశ్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ ఎండీ సీఈఓ దీపక్ మెహ్రోత్రా తెలిపారు. ఇందిరానగర్‌లో శుక్రవారం పారితోషి కాలు, ప్రోత్సాహకాలకు ఎంపిక విద్యార్థుల జాబితా ప్రకటించారు. ఎండీ మాట్లాడుతూ 16ఏళ్ల అనుభవంతో జాతీయ ప్రతిభాన్వేష పరీక్షలను నిర్వహించదలిచామన్నారు. గుణాత్మక మైన విద్య మా ఆశయమని ఆకాశ్ డిజిటల్ ఇన్విక్టస్ కోర్సులకు రూ.250 కోట్ల విలువైన వందశాతం విద్యార్థి వేతనాలను ఇవ్వనున్నామన్నారు. దీంతో పాటు 2.5 కోట్ల విలువైన నగదు ప్రోత్సాహకం అందిస్తామన్నారు. విద్యార్థులు మెడికల్, ఇంజనీరింగ్ కోర్సులలో వృత్తి జీవన కలలను సాకారం చేస్తామన్నారు. 8 నుంచి 12వ తరగతి విద్యార్థులకు ఇన్విక్టస్ జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో శిక్షణ ఇస్తున్నామన్నారు. జాతీయస్థాయిలో అర్హత, విద్యార్థి ప్రోత్సాహకాల పరీక్షలను ఈనెల 24, 31 సెప్టెంబరు 7న నిర్వహిస్తున్నామన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లలో పరీక్షలు ఉంటాయన్నారు. 300 రూపాయలు చెల్లించి రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. దాదాపు అన్ని రాష్ట్రాలలో ప్రత్యేక పరీక్షా కేంద్రాలు ఉంటాయన్నారు.

సమాజ నిర్మాణంలో జీవనశైలి పాత్ర కీలకం

» ఎమ్మెల్యే మంజుల లింబావళి



తరగతి గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మంజుళ

మహదేవపుర, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ సమాజ నిర్మాణంలో వ్యక్తి జీవనశైలి పాత్ర, విద్య కీలకపాత్ర వహిస్తుందని ఎమ్మెల్యే మంజుళ అరవింద లింబావళి అభిప్రాయపడ్డారు. బిదరహళ్ళి ప్రభుత్వ పాఠశాలలో బీబీఎంపీ ఆధ్వర్యంలో నిర్మించిన నూతన తరగతి గదులను ప్రారంభించి మాట్లాడారు. నిరక్షరాస్యులు నేటికీ కడు పేదరిక జీవనం సాగిస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. అయితే విద్యావంతులు తమ జీవనశైలిని మార్చుకునే సామర్థ్యం ఉంటుందన్నారు. సమాజ సంస్కరణలో ప్రభుత్వ పాఠశాలలు పాత్ర కూడా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పలు వాణిజ్యసంస్థలు చేయూత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కాగా ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని రాణించాలని విద్యా ర్థులకు హితవు పలికారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్థానిక ప్రము ఖులు నటరాజ్, బీజీ రాజేశ్, గణేశ్, మారుతి, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు



మడకశిర రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిగాయి. మండలంలోని జమ్మానిపల్లిలోని లక్ష్మీ నిడమామిడమ్మదేవి, మెళవాయి చౌడేశ్వరీదేవి అమ్మవారి ఆలయాల్లో ఉదయం నుంచి అమ్మవార్లకు అర్చనలు, అభిషేకాలను అర్చకులు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో ఆలయాలకు వెళ్లి అమ్మవారిని దర్శనం చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు. గుడిబండ, (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రమైన గుడిబండలో వెలసిన తుమ్మల మారెమ్మ అమ్మవారికి భక్తులు శ్రావణ శుక్రవారం సందర్భంగా పూజలు నిర్వహించారు. అమ్మవారు వెండి ఆభరణాలతో అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

శ్రీభాగ్ ఒప్పందంపై పార్లమెంటులో చర్చించాలి

రాయలసీమ రాష్ట్ర సమితి అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి

బెంగళూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం తమిళులు, ఆంధ్రుల మధ్య మద్రాస్‌లో జరిగిన శ్రీభాగ్ ఒప్పందానికి 88ఏళ్లు అవుతున్నా అమలుకు నోచుకోలేదని, పార్లమెంటులో చర్చించాలని రాయలసీమ రాష్ట్ర సమితి అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం బెంగళూరులో ప్రవాసాంధ్రులతో రాయలసీమ అభివృద్ధికి సంబంధించి చర్చలు జరిపారు. శ్రీభాగ్ ఒప్పందం ప్రకారం అమలు చేస్తే రాయలసీమకు న్యాయం జరుగుతుందన్నారు. 1937 నవంబరు 16న మద్రాస్‌లో కాశీనాథుని నాగేశ్వరరావు నివాసంలో ఒప్పందం జరిగిందన్నారు. ఉమ్మడి మద్రాస్‌లో ఉన్నప్పుడు తెలుగువాళ్లకు అన్యాయం జరిగిందన్నారు. తొలి ఆంధ్ర మహాసభ 1913లో బాపట్లలో జరిగిందన్నారు. ఇలా దశాబ్దాల కిందటి ఒప్పందాలు మరుగున పడ్డాయన్నారు. శ్రీబాగ్ ఒప్పందాన్ని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎంపీలు లోక్‌సభలో ప్రస్తావించా లన్నారు. రాయలసీమ మరెంతకాలం కరువుతో కొట్టుమిట్టాడాలన్నారు. సదరు వినతులను ప్రధానమంత్రితోపాటు లోక్‌సభ స్పీకర్, ఆంధ్రప్రదేశ్ గవర్నర్, సీఎంలకు పంపినట్టు తెలిపారు.

అనుమతి లేని క్లినిక్‌ల తనిఖీ



పరిశీలిస్తున్న ఆరోగ్యశాఖ అధికారులు

శిడ్లఘట్ట, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని జంగమకోటె నుంచి హెచ్ క్రాస్‌కు వెళ్లే మార్గంలో పెట్రోల్‌బంకు సమీపాన ఉండే దుకాణం లోపల నకిలీ క్లినిక్ నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఆరోగ్యశాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. సాయిశ్రద్ధా స్టోర్ అనే అంగడి వెనుక క్లినిక్ ఉంది. సుమారు 15 అడుగుల స్థలంలో ముందుభాగాన 5 అడుగులలో జనరల్‌స్టోర్ ఉండగా వెనుకన రెండు బెడ్‌లతో క్లినిక్‌ను సుమారు ఆరు నెలలుగా నిర్వహిస్తున్నట్టు గుర్తించారు. తాలూకా ఆరోగ్య అధికారి వెంకటేశ్ మూర్తి, జిల్లా ఆరోగ్య అధికారి, పోలీసులతో కలసి పరిశీలించారు. పలు రకాల ఔషధాలు, సిరంజిలు ఇతరత్రా ఉన్నట్టు గుర్తించారు. నిర్వాహకురాలు భాగ్యమ్మను హెచ్చరించారు. క్లినిక్‌కు ఎలాంటి అనుమతులు లేకపోవడంపై కేపీఎం ప్రకారం కేసు నమోదు చేస్తున్నట్టు తెలిపారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సవితాకు సమాచారం ఇచ్చి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకోవాలని సూచించారు.

ధూమపానం చేసేవారిలో

శ్వాసకోశ క్యాన్సర్ ప్రభావం

● సంప్రద ఆసుపత్రి చీఫ్ రాధే శ్యామ్‌నాయక్

బెంగళూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): దేశంలో శ్వాసకోశ క్యాన్సర్ కేసులలో 10-30శాతం ధూమపానం చేసేవారే ఉన్నారని సంప్రద ఆసుపత్రి చీఫ్ రాధే శ్యామ్‌నాయక్ అభిప్రాయపడ్డారు. శుక్రవారం శ్వాసకోశ క్యాన్సర్‌పై ఆయన మీడియాతో వర్చువల్‌గా మాట్లాడారు. సాధారణంగా 30శాతం దాకా శ్వాస కోశ క్యాన్సర్‌లలో ధూమపానంగా నిర్ధారణ అయ్యిందని, కానీ కొన్ని సర్వేలలో 40శాతం కూడా ఉన్నట్టు తెలుస్తోందన్నారు. పొగతాగేవారితోపాటు వారి ద్వారా పొగను పీల్చేవారిపైనా ప్రభావం చూపుతుందన్నారు. మూడు దశా బ్దాలలో బెంగళూరు, ఢిల్లీ, చెన్నై వంటి మెట్రో నగరాలలో పురుషులతోపాటు మహిళల్లో శ్వాసకోశ క్యాన్సర్ పెరుగుతోందన్నారు. అందుకు జీవనశైలితోపాటు పొగాకు ఉత్పత్తుల వాడకం కూడా కారణంగా ఉందన్నారు. అంకాలజీ కన్సల్టెంట్ వినోద్ కే రమణి మాట్లాడుతూ శ్వాసకోశ సమస్యలు తలెత్తినప్పుడు ధూమపానం చేసేవారే కాకుండా అలవాటులేనివారి కూడా పరీక్షలు చేయించుకోవాలన్నారు. దగ్గు, ఛాతీలో నొప్పి, బరువు తక్కువ కావడం, క్షయ వంటి లక్షణాలు శ్వాసకోశ క్యాన్సర్ దాకా దారి తీస్తాయన్నారు. సర్జికల్ అంకాలజీ కన్సల్టెంట్ ప్రభాకరన్ మాట్లాడుతూ ఇమ్యునో థెరపీ, టార్గెటెడ్ థెరపీ వంటివాటిని ఎంపిక చేసుకుని చికిత్సలు పొందాలన్నారు.

ద్విచక్రవాహనాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న వాహనాలతో పోలీసులు

బంగారపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): వివిధ ప్రాంతాలలో ట్రయల్‌కు వెళ్లి వంచనకు పాల్పడిన ఒక వ్యక్తిని అరెస్టు అతడి నుంచి రూ.5.50 లక్షల విలువైన ఐదు ద్విచక్రవాహనాలను బూదికోటె పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జూలై 15న బూదికోటె గ్రామానికి చెందిన అశోక్ అనే వ్యక్తి ద్విచక్రవాహనం కొనుగోలు వేళ ట్రయల్‌కు వెళ్లి మోసానికి పాల్పడ్డాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. డీఎస్పీ ఎస్ పాండురంగ మార్గదర్శకత్వంలో ఇన్‌చార్జ్ ఎస్సై కిరణ్‌కుమార్ దర్యాప్తు చేపట్టారు. చిక్కమగళూరు జిల్లా కడూరు తాలూకాకు చెందిన ప్రదీప్‌ను అరెస్టు చేశారు. దర్యాప్తులో శిరా, కుణిగల్, మైసూరు, చన్నరాయపట్టణ, శిడ్లఘట్ట తదితర ప్రాంతాలలో ఐదు బైక్‌లను చోరీకి పాల్పడినట్టు గుర్తించారు. కార్యాచరణలో సిబ్బంది పాల్గొనగా జిల్లా ఎస్పీ శివాంశు రజ్‌పుత్ ప్రశంసించారు.